PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 214 | సంపుటి 4 | మంగళవారం | 21-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

## అధికారంలోకి రాగానే

# హైడ్రాను రద్దు చేస్తాం..



- చివరి శ్వాస వరకు తెలంగాణ కోసమే నా పోరాటం
- కాంగ్రెస్ పాలనలో అరాచకం, గూండాగిరి
- రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జైభీమ్.. ఇదేనా కాంగ్రెస్ మార్క్ పాలన?
- యూరియా బస్తాలు ఇవ్వడం కూడా చేతకాని ప్రభుత్వం..
- తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మళ్ళీ మొదలవ్వాలి
- జగిత్యాల బహిరంగ సభలో కేసీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి.. గులాబీ కండువా కప్పిన అధినేత

"తెలంగాణ అస్థిత్వం కోసం తన చివరి శ్వాస వరకు పోరాడుతూనే ఉంటానని, తనను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తన సంకల్పాన్ని దెబ్బతీయలేరని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (KCR) స్పష్టం చేశారు. సోమవారం జగిత్యాలలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రాష్ట్రంలో చీకట్లు ముసిరాయని, ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురై రైతులు ఆగమవుతున్నారని ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్ పోవాలి - బీఆర్ఎస్ రావాలి' అన్న నినాదంతో జగిత్యాల గడ్డ నుంచే సరికొత్త జైత్రయాత్రకు ఆయన శంఖారావం పూరించారు."

**జగిత్యాల, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం):**

తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (KCR) వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్షంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. — మిగతా 2లో..




# కాళేశ్వరం దోషులను వదలం

- రీడిజైనింగ్ పేరుతో రూ. 1.50 లక్షల కోట్ల దోపిడీ
- సీబీఐ విచారణకు కేంద్రం ఎందుకు ఆదేశించడం లేదు?
- తప్పించుకోవడానికే హరీశ్ రావు ఢిల్లీ పర్యటన..
- మేడిగడ్డకు త్వరలోనే రిపేర్లు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం
- కాళేశ్వరం పర్యటలనలో సీఎం రేవంత్ రెడ్డి

2

**భూపాలపల్లి, ప్రభాత గమనం:**


కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందని, ఈ కుంభకోణంలో దోషులు ఎంతటి వారైనా శిక్షించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన ఆయన, తొలుత కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని రూ. 198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనం తరం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి అధికారుల తో సమీక్ష జరిపిన తర్వాత ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. — మిగతా 2లో..

## తెలంగాణలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

# ఎన్నికల నగారా!

- ఓటర్ల జాబితాల సిద్ధతపై ఎస్ఈసీ ఆదేశాలు
- మొత్తం 566 జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఖరారు
- మే నెలలోనే ఎన్నికల నిర్వహణకు అవకాశాలు
- జిల్లాల వారీగా కొత్త ఓటర్ల వివరాల సమీకరణ
- ముసాయిదా జాబితాల విడుదలకు ఏర్పాట్లు
- హైకోర్టు ఆదేశాలతో గతంలో నిలిచిన ప్రక్రియ
- గ్రామాల విలీనంతో స్థానాల సంఖ్యలో తగ్గుదల
- ఎన్నికల వేళ ఆశావహుల్లో ఉత్సాహం

4




తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) అడుగులు వేగవంతం చేసింది. హైకోర్టు ఆదేశాలతో గతంలో నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియను మళ్లీ పట్టాలెక్కించేందుకు కసరత్తు ప్రారంభించింది. తాజా ఓటర్ల వివరాల సమీకరణతో పాటు, ముసాయిదా జాబితాల విడుదలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. అన్ని అనుకూలిస్తే మే నెలలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో క్షేత్రస్థాయిలో రాజకీయ సందడి మళ్లీ మొదలైంది.

## హన్మకొండలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన నిందితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

2



## విద్యావంతులు మోసపోవడం బాధాకారం

- డిజిటల్ అరెస్ట్ మోసాలపై సీజేఐ దిగ్భ్రాంతి
- మోసపూరిత లావాదేవీల అదుపునకు 'కిల్-స్విచ్' వ్యవస్థపై కోర్టులో చర్చ

04

## అఫిడవిట్లలో ఆస్తుల వ్యత్యాసం

- పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అఫిడవిట్లలో రూ. 100 కోట్లకు పైగా తేడా
- వాస్తవాలు దాచారంటూ హైకోర్టులో ఓటరు పిటిషన్
- ఎన్నికల ముందు టీవీకే చీఫ్ విజయ్ కి కొత్త తలనొప్పి
- వచ్చే వారం నివేదిక సమర్పించాలని ఐటీ శాఖకు ఆదేశం

2






# అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తాం..

మొదటి పేజీ తరువాయి

## తన దీక్షతోనే పార్లమెంట్ అల్లకల్లోలం..

గతంలో తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్ ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని కొంతమంది తనను హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని కేసీఆర్ ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14F జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ దీ చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చి దంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ JAC పెట్టి పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ఓ ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు. కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని.. అసెంబ్లీలోనే తాను చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఈ కాంగ్రెస్ హయాంలో మిషన్ భగీరథను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆగ్రహించారు.

### పేదల ఇండ్లు కూల్చే హైడ్రాను రద్దు చేస్తాం..

హైదరాబాద్ లో హైడ్రాను తీసుకొచ్చారని.. నిజామాబాద్ లోనూ తెస్తామని అంటున్నారని ప్రస్తావించారు. పేదల ఇళ్లను కూల్చివేయడమేనా..? ఈ ప్రభుత్వ పని అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని అన్నారు. హైడ్రా రద్దుపైనే తన తొలి సంతకం ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ కోసం వేల ఇళ్లు కూల్చేస్తారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఆరోపించారు. మూసీ సుందరీకరణ చేయొద్దని తాను అనడం లేదని.. కానీ పేదల ఇళ్లు కూల్చివేయడం ఎందుకని..? నిలదీశారు. రైతులకు నష్టమనే మీటర్లు పెట్టడానికి తాను ఒప్పుకోలేదని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మోకరిల్లి మీటర్లు పెడుతోందని.. మీటర్ల ఏర్పాటుపై తాను యుద్ధం చేస్తానని కేసీఆర్ హెచ్చరించారు.

## చివరి శ్వాస వరకు తెలంగాణ కోసమే..

తాను చావాలి అంటూ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని కేసీఆర్ దుయ్యబట్టారు. తనను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు చస్తామా..? అని ఎద్దేవా చేశారు. తాను చావాలంటూ కాంగ్రెస్ నేతలు శాపాలు పెడితే తాను చస్తానా..? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు తాను తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో సరిగా కరెంట్ వస్తోందా..? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు.. ఆలోచించి ఓట్లు వేయాలని ఆనాడే తాను చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని తాను చెప్పానని అన్నారు. ఒక్కసారే వేయాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒక్కోసా రి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు ఎన్ని కల ముందు నోటికొచ్చిన మాటలు.. ఇష్టమొచ్చిన కథలు చెప్పారని విమర్శించారు. వీళ్ల మాటలు న మ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు గోస పడుతు న్నారని చెప్పారు. 1.7 శాతం ఓట్ల తేడాతోనే మనం ఓడిపోయామని ప్రస్తావించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి వెళ్లినా తాను ఎక్కడా మాట్లాడలేదని అన్నారు. తాము రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ సభతోనే రైతుబంధు నిధులు

తమ హయాంలో ఎకరం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ధర ఉండేదని కేసీఆర్ ప్రస్తావించారు. ఇప్పుడు అమ్మేవాళ్లు ఉన్నారు కానీ.. కొనేవాళ్లే లేరని చెప్పారు. ఈ కాంగ్రెస్ సర్కార్‌కు యూరియా బస్తాలు కూడా ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. యాప్‌ల పేరుతో కాళ్లకు వాపులు తప్ప ఏమీ లేదని విమర్శించారు. జగిత్యాలలో తాను సభ పెడితేనే.. రెండోవిడత రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ తాను సభ పెడితేనే మూడోవిడత రైతుబంధు ఇస్తారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల జీవితాలు ఆగమయ్యాయని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అంతా దోపిడీ, గూండాగిరి, అరాచకాలేనని ఆరోపించారు. అసలు తెలంగాణలో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పున: నిర్మాణం జరగాలని సూచించారు. ఈ కాంగ్రెస్ సర్కార్‌ను పోరాటం చేసి నిలదీయాల్సిందేనని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా వదిలేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ పున: నిర్మాణ యజ్ఞం ప్రారంభం కావాలని సూచించారు. జగిత్యాల నుంచే జైత్రయాత్ర మొదలవ్వాలని.. కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

# కాళేశ్వరం దోషులను వదలం

- రీడిజైనింగ్ పేరుతో రూ. 1.50 లక్షల కోట్ల దోపిడీ
- సీబీఐ విచారణకు కేంద్రం ఎందుకు ఆదేశించడం లేదు?
- తప్పించుకోవడానికే హరీశ్ రావు ఢిల్లీ పర్యటన..
- మేడిగడ్డకు త్వరలోనే రిపేర్లు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం
- కాళేశ్వరం పర్యటలనలో సీఎం రేవంత్ రెడ్డి




మొదటిపేజీ తరువాయి

## రాజకీయ లబ్ధి కోసమే రీడిజైనింగ్:

2009లో వైఎస్సార్ హయాంలో రూ. 38,063 కోట్లతో మొదలైన ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును, కేసీఆర్ ప్రభుత్వం కేవలం ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే 'కాళేశ్వరం'గా రీడిజైన్ చేసిందని సీఎం ధ్వజమెత్తారు. అంచనాలను ఏకంగా రూ. 1.50 లక్షల కోట్లకు పెంచి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. "2018 ఎన్నికల్లో అద్భుతమంటూ భ్రమలు కల్పించారు. కానీ 2023లో మేడిగడ్డ కుప్పకూలడంతో వీరి పాపం పండింది. ప్రకృతి వాస్తవాలను బయటపెట్టింది" అని వ్యాఖ్యానించారు.

## హరీశ్ రావు ఢిల్లీ పర్యటన మతలబేంటీ?

మాజీ మంత్రి హరీశ్ రావు రహస్యంగా ఢిల్లీ పర్యటించడంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విచారణ నుంచి తప్పించుకోవడానికి బీజేపీ నేతల కాళ్లు పట్టుకోవడానికే హరీశ్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. అక్కడ ఎవరెవరిని కలిశారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయని, అందుకే తాము పదే పదే లేఖలు రాసినా సీబీఐ విచారణపై కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు.

## రైతులకు నీరందిస్తాం:

కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు కనీసం లక్ష ఎకరాలకు కూడా కొత్తగా నీరు ఇవ్వలేకపోయారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వల్లే రాష్ట్రంలో పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే నిపుణుల సలహాతో ప్రాజెక్టుకు రిపేర్లు చేయించి రైతులకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ప్రతిపక్ష హోదా ఊడగొడతాం..

- లక్షకోట్ల అవినీతిపరుడిని ఉరితీసినా పాపం లేదు
- భూపాలపల్లి బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి
- రైతు భరోసా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి



**భూపాలపల్లి, ప్రభాత గమనం:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో బీఆర్ఎస్‌కు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. YS, DSలా తాను, మహేశ్ కుమార్ గౌడ్ చరిత్రను పునరావృతం చేస్తామని స్పష్టం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల

రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సీఎం పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

## ఎన్టీఆర్‌కు జీవన్‌రెడ్డి వెన్నుపోటు

ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే.. కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కరరావుతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా..? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా..? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

# హన్మకొండలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన నిందితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో:**

హన్మకొండలో మరోసారి చైన్ స్నాచింగ్ ఘటన స్థానికుల్లో కలకలం రేపింది. ఎక్సైజ్ కాలనీ పరిధిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఎక్సైజ్ కాలనీకి చెందిన చింతల కల్పన (54) సోమవారం ఉదయం సమీప దుకాణంలోకి వెళ్లి కిరాణా సామాగ్రి కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా, బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సుబేదారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా, ఒంటరిగా వెళ్లే సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# సూధనపల్లి స్ఫూర్తిదాయకంగా నిలవాలి

- మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్




**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం సధనపల్లి గ్రామంలో ఈరోజు రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామ రక్షణ, గంజాయి నిర్మూలనతో యువత శ్రేయస్సుకు ప్రతీకగా నిలిచిన "–మన ఊరు మన బాధ్యత"అరైవ్ – అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డా. శబరిష్ ముఖ్య అతిధిగా , తొర్రూర్ డీఎస్పీ కృష్ణ కిషోర్ , మరిపెడ సీఐ పవన్ కుమార్, సీరోల్ ఎస్.ఐ సంతోష్ పాల్గొని గ్రామ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో సుధనపల్లి గ్రామ ప్రవేశం నుంచి గ్రామంలోకి జిల్లా ఎస్పీ డా. శబరిష్ స్వయంగా హెల్మెట్ ధరించి గ్రామ సర్పంచ్, ప్రజలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ద్వారా రోడ్డు భద్రతపై స్పష్టమైన సందేశాన్ని అందించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మరిపెడ సీఐ పవన్ కుమార్ రోడ్డు ప్రమాదాల దృశ్యాలను చూపిస్తూ హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు గురించి యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా వీడియోలు, అవగాహన పాటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, మాట్లాడుతూ...సుధనపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా మూడు కీలక తీర్మానాలను గ్రామం లో పాటిస్తునందుకు సంతోషం వ్యక్తం చేసారు. ప్రతి ద్విచక్ర వాహనదారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గ్రామ భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించి గ్రామాన్ని వ్యసన రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న సహకారంతో 150 మంది ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడంపై ఎస్పీ సర్పంచ్ ను అభినందించారు. గంజాయి వినియోగం లేదా రవాణాపై సమాచారం అందించిన వారికి ₹5000 వరకు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించి ప్రజల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించారు. గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న, ఉపసర్పంచ్ మరియు పాలక వర్గం చేసిన కృషిని జిల్లా ఎస్పీ ప్రశంసించారు.

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం..

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి



**మహబూబాబాద్, ప్రభాతగమనం :**

గంజాయి రహిత సమాజమే లక్ష్యమని మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి అన్నారు. సోమవారం మహబూబాబాద్ పీఎస్ పరిధిలోని లక్ష్మీపురం తండాలో 'పోలీసు కళాజాత' అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఐ అంజలి మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా వేళ్ళూనుకుపోయి ఉన్న మూఢ నమ్మకాలను పారద్రోలాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి వాటిని పూర్తిగా అరికట్టాలని కోరారు. గ్రామాల రక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ,ప్రతి గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోలీసుల ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. కళాజాత బృందం సభ్యులు పృధ్వి,సతీష్, తిరుపతి తమ ప్రదర్శనల ద్వారా సామాజిక అంశాలపై ప్రజలకు వినోదా త్మకంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపిక,కానిస్టేబుళ్లు బాలరాజు,సంపత్,బాపూజీలతో పాటు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీవీకే అధినేత విజయ్

# అఫిడవిట్లలో ఆస్తుల వ్యత్యాసం

- పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అఫిడవిట్లలో రూ. 100 కోట్లకు పైగా తేడా
- వాస్తవాలు దాచారంటూ హైకోర్టులో ఓటరు పిటిషన్
- ఎన్నికల ముందు విజయ్ కి కొత్త తలనొప్పి
- వచ్చే వారం నివేదిక సమర్పించాలని ఐటీ శాఖకు ఆదేశం




**ప్రభాత గమనం, చెన్నై, ఏప్రిల్ 20 :**

తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపకుడు, నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల ప్రకటనపై వివాదం నెలకొంది. ఆయన సమర్పించిన రెండు అఫిడవిట్లలో ఆస్తుల విలువలో సుమారు రూ. 100 కోట్ల వ్యత్యాసం ఉండటంపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ స్పందన తెలియజేయాలని మద్రాస్ హైకోర్టు సోమవారం ఆదేశించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, ఈ రెండు చోట్లా ఆయన సమర్పించిన ఆస్తుల వివరాల్లో భారీ తేడాలున్నాయని పెరంబూర్ ఓటరు విగ్నేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పెరంబూర్ అఫిడవిట్‌లో విజయ్ తన ఆస్తుల విలువను రూ. 115.13 కోట్లుగా పేర్కొనగా, తిరుచ్చి ఈస్ట్ అఫిడవిట్‌లో మాత్రం రూ. 220.15 కోట్లుగా చూపారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒకే వ్యక్తి రెండు అఫిడవిట్లలో రూ. 105 కోట్ల తేడా చూపడం వాస్తవాలను మరుగున పరచడమేనని ఆయన వాదించారు. చీఫ్ జస్టిస్ ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రెండు నియోజకవర్గాల్లో నామినేషన్ వేసిన అభ్యర్థి, ఒక చోట ఆస్తుల విలువను ఇంత భారీగా తక్కువ చేసి చూపడం సరైన పద్ధతి కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ వ్యత్యాసాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదాయపు పన్ను శాఖను ఆదేశించింది.

## మే 12కు విచారణ వాయిదా:

ఈ క్రమంలో విజయ్ సమర్పించిన ఆస్తుల వివరాల వాస్తవికతపై స్పష్టత ఇవ్వాలని ఐటీ శాఖ కు సూచిస్తూ, తదుపరి విచారణను వచ్చే వారానికి కోర్టు వాయిదా వేసింది. ఏప్రిల్ 23న ఎన్నిక లు జరగనున్న తరుణంలో ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అంతర్రాష్ట్ర సైబర్ ముఠా గుట్టురట్టు

- 9 రాష్ట్రాల్లో పోలీసుల మెరుపు దాడులు..
- 32 మంది బ్యాంకు అధికారులు సహా 52 మంది అరెస్టు
- 7 రోజుల పాటు 16 ప్రత్యేక బృందాల వేట..
- రూ. 150 కోట్ల స్కామ్.. 350 బ్యాంకు ఖాతాల వినియోగం
- డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరిస్తే 1930కి కాల్ చేయండి
- హైదరాబాద్ పోలీసుల వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్

**హైదరాబాద్, ప్రభాత గమనం:**
దేశవ్యాప్తంగా సామాన్యుల నడ్డి విరుస్తూ కోట్ల రూపాయలు కొల్ల గొడుతున్న భారీ సైబర్ నేరాల నెట్‌వర్క్ ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'లో భాగంగా 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, నేరగాళ్లకు సహకరిస్తున్న 32 మంది బ్యాంకు అధికారులు సహా మొత్తం 52 మందిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.

### బ్యాంకు అధికారులే ప్రధాన సూత్రధారులు

ఇన్వెస్ట్ మెంట్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలకు పాల్పడే ముఠాలకు అండగా నిలుస్తున్న బ్యాంకు అధికారులే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగింది. నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు, 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. కేవైసీ నిబంధనలను తుంగలో తొక్కి, నకిలీ పత్రాలతో మ్యూల్ ఖాతాలు తెరిచి నేరగాళ్లకు సహకరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

### విస్తుపోయే వాస్తవాలు

ఈ నెట్‌వర్క్ ద్వారా ఇప్పటివరకు రూ. 150 కోట్ల మేర మోసాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు వాడిన 350 బ్యాంకు ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన 850 సైబర్ కేసులతో సంబంధం ఉందని తేలింది. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, 21 షెల్ కంపెనీల స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాల్లో 16 ప్రత్యేక బృందాలు వారం రోజుల పాటు ఈ సోదాలు నిర్వహించాయి.

### చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించం: సీపీ సజ్జనార్

సైబర్ నేరాల కట్టడిలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "డిజిటల్ అరెస్టులు చేసే సంస్కృతి ఏ వ్యవస్థలోనూ లేదు. దర్యాప్తు సంస్థల పేరుతో వచ్చే వీడియో కాల్స్‌కు భయపడకండి. మీ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇస్తే, మిమ్మల్ని కూడా నేరస్థులుగానే పరిగణిస్తాం" అని ఆయన హెచ్చరించారు. మోసపోయిన బాధితులు వెంటనే 1930 నంబర్‌కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# పుట్టకోటలో తాగునీటికి తండ్లాట

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం



**గార్ల, ఏప్రిల్ 20 (ప్రభాతగమనం):**
గ్రామంలోని సుమారు 60 నుండి 70 కుటుంబాలకు ఆధారమైన చేతి పంపు (బోరింగ్) మరమ్మతుకు గురవ్వడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు మండిపోతున్న వేళ, తాగడానికి చుక్క నీరు దొరకక్క అల్లాడిపోతున్నారు.ప్రభుత్వం ఇంటింటికీ నీరు ఇస్తున్నామని చెబుతున్నా, సాంకేతిక కారణాల వల్ల ఒక్కరోజు 'మిషన్ భగీరథ' నీళ్లు రాకపోయినా ఈ పుట్టకోట వాసులకు ఈ బోరింగ్ యంత్రమే ఏకైక దిక్కు. అయితే గత కొంతకాలంగా ఈ బోరింగ్ పనిచేయకపోవడంతో, నిత్యావసరాలకు కూడా నీరు లేక మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోంది.ఈ సమస్యపై స్థానిక ప్రజలు ఇప్పటికే రెండుసార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని స్థానికులు వాపోతున్నారు. "మేము సమస్యను విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎండాకాలంలో నీరు లేకపోతే మేము ఎలా బ్రతకాలి?" అని స్థానిక నివాసితులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే సదరు బోరింగ్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.

# మక్కల కొనుగోలు కేంద్రంలో ఎమ్మెల్యే మురళీ నాయక్ పరిశీలన

కేసముద్రం ఏప్రిల్ 20(ప్రభాత గమనం):
మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ పీఏసీఎస్ ధనసరి ఆధ్వర్యంలో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మార్కెట్ కమిటీ కేసముద్రం యందు పర్యటించినారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని మార్కెట్ కి తీసుకొచ్చేటప్పుడు 14 శాతం లోపు తేమ ఉండేటట్లు చూసుకొని ఎటువంటి మట్టి పెల్లలు, చెత్తాచెదారం లేకుండా రైతుల పంట క్షేత్రాలలోనే శుభ్రపరచుకొని , అధికారులు తెలిపిన తేదీ ప్రకారం వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూపాయలు 2400 పొందాలని సూచించారు. అధికారులతో మాట్లాడుతూ..రైతులకు మార్కెట్ యార్డ్ లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు కాంటాలు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని, కాంటాలు అయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు షిఫ్ట్ చేసి త్వరితగతిన మొక్కజొన్న కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో కావలసినటువంటి గన్ని బ్యాగులు మాయిచ్చర్ మిషన్లు, టార్పాలిన్ సీట్లు, ఏర్పాటు చేయాలని రైతులకు మంచినీటి వసతి కలిగించాలని, కావలసిన లారీలు త్వరితగతిన తెప్పించి మొక్కజొన్న కొనుగోలను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి గారు,మార్కెట్ కమిటీ కార్యదర్శి అమరలింగేశ్వర రావు, సిఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్ , మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధనసరి సీఈవో గోపాల మల్లారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి కే. రవివర్మ సెంటర్ ఇన్చార్జులు, మండల నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# పరిపాలనాదక్షుడు నారా చంద్రబాబు నాయుడు

- టీడీపీ మండలాధ్యక్షుడు ఎల్లయ్య
- ఘనంగా ఏపీ సీఎం బర్త్ డే వేడుకలు

**కేసముద్రం,ఏప్రిల్ 20(ప్రభాత గమనం):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 79 వ పుట్టినరోజు వేడుకలు కేసముద్రం మండల టిడిపి అధ్యక్షుడు ఏషబోయిన ఎల్లయ్య అధ్యక్షతన మండలంలోని మహమూద్ పట్నం అంగన్వాడి కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా మహమ్మద్ పట్నం అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అంగన్వాడి విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కేసముద్రం మండల టిడిపి అధ్యక్షుడు ఏషబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ పరిపాలన దక్షతలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు గొప్ప పరిపాలనా దక్షుడని, దూరదృష్టి కలిగిన నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని జన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి మండల టిడిపి అధ్యక్షుడు గుజ్జునూరి వెంకన్న, ఇనుగుర్తి గ్రామ టిడిపి అధ్యక్షుడు గంజి రవీందర్ రెడ్డి, కేసముద్రం, ఇనుగుర్తి మండల టిడిపి ప్రధాన కార్యదర్శులు గుగులోత్ లక్ష్మణ్, జీనుగుల పుల్లయ్య, కేసముద్రం టిడిపి మండల సీనియర్ నాయకులు ఎస్.కె భాషుమియా , అంగన్వాడి ఉపాధ్యాయురాలు ఎస్కే సలీమా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పీక్లా తండా సర్పంచ్ గుగులోత్ ఝాన్సీ నరేష్ నాయక్

**కేసముద్రం, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం):**
చిన్నారులు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు పోషకాహారం పట్ల అవగాహన కలిగి ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పీక్లా తండా సర్పంచ్ గూగులోత్ ఝాన్సీ నరేష్ నాయక్ అన్నారు. సోమవారం కేసముద్రం మండలం పీక్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడగుట్ట తండా అంగన్‌వాడీ కేంద్రంలో 'శిశువుల పోషణ - ఆరోగ్య సంరక్షణ' అనే అంశంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్‌తో పాటు ఎంపీఓ హరీష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రేమ జ్యోతి హాజరయ్యి మాట్లాడారు...సమాజంలో రక్తహీనత, పోషకాహార లోపం అనేది ప్రధాన సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కిశోర బాలికలు, గర్భిణీలు పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తవని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువును ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అంగన్‌వాడీ టీచర్ గూగులోత్ నీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, పంచాయతీ కార్యదర్శి లెనిన్, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, వాణి, జ్యోతి, సునీత, ఆయా పద్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# జనగణన ఆధారంగానే సంక్షేమ పథకాలు

- కేసముద్రం తహసీల్దార్ వివేక్

**కేసముద్రం ఏప్రిల్ 20(ప్రభాత గమనం):**
జనగణన ఆధారంగానే ప్రజలకు సంక్షేమ పథకాలు,ఆర్థిక ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని కేసముద్రం మండల తహసీల్దార్, జనగణన మండల ఇంచార్జ్ ఆఫీసర్ జి. వివేక్ అన్నారు. జన గణనపై మండలంలోని ఎన్యూమరేటర్లకు నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన సోమవారం కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల తహసీల్దార్ జి.వివేక్ మాట్లాడుతూ.. జనగణన అనేది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చాలా ముఖ్యమైన కార్యక్రమమని,జనగణన పై ఎన్యూమరేటర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ట్రైనర్స్ యేదునూరి అశోక్, బోరిగం రాములు తోపాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సీఎంను కలిసిన నార్వే బృందం

**హైదరాబాద్ ఏప్రిల్ 20(ప్రభాత గమనం):**
భారత్‌లో నార్వే రాయబారి మే-ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ - నార్వే మధ్య పరస్పర సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ రీజియనల్ పాస్‌పోర్ట్ అధికారిణి (ఆర్పివో) స్నేహజ జొన్నలగడ్డ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా మ్యాపింగ్‌లో వేగం పెంచాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**మహబూబాబాద్, (ప్రభాత గమనం) :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సిఈవో) సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా సి.ఇ.ఓ మాట్లాడుతూ.. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే 95 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తయిందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ అదే స్థాయి ఫలితాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారులు (బిఎల్వోలు), సూపర్వైజర్లకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ క్షేత్రస్థాయి పనులను పర్యవేక్షించాలని తెలిపారు.బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై రాజకీయ పార్టీలతో చర్చలు పూర్తయినందున, వారి సహకారాన్ని మ్యాపింగ్ ప్రక్రియలో సమర్థవంతంగా వాడుకోవాలన్నారు.ఈ ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వం, పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.మహబూబాబాద్ కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లాలో జరుగుతున్న పనుల వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ బిఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ మ్యాపింగ్ పనులను స్వయంగా పర్యవేక్షించాలని ఆమె అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, మహబూబాబాద్ ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో పవన్ కుమార్, ఎన్నికల విభాగం సూపర్ వైజర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'జీవో 98'ను రద్దు చేయాలి

- టీజేఎస్ నేత మురళీ తారకరామారావు



**గార్ల, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం):**
మహబూబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో మున్నేరు - పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 98 పై నిర్వహించిన అవగాహన సదస్సు సోమవారం ఉద్రిక్తంగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (DEO) పాల్గొన్న సందర్భంలో, తెలంగాణ జన సమితి (TJS) రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళీ తారకరామారావు గళమెత్తారు. వివాదాస్పదంగా మారిన జీవో నెంబర్ 98ని తక్షణమే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇది స్థానిక ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. గతంలో నిర్ణయించిన జీవో నెంబర్ 1076 ప్రకారమే గార్ల మండలంలో మున్నేరు ప్రాజెక్టును నిర్మించాలని ఆయన స్పష్టం చేశారు. కొత్త ప్రతిపాదనల కంటే పాత జీవో ప్రకారం ప్రాజెక్టు చేపడితేనే ఈ ప్రాంతానికి శాశ్వత నీటి వసతి కలుగుతుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా, రైతుల పక్షాన నిలబడి జీవో 1076ను అమలు చేయాలి. మున్నేరు ప్రాజెక్టు విషయంలో కాలయాపన చేస్తే సహించేది లేదు."ఈ అవగాహన సదస్సులో జిల్లా అధికారులతో పాటు భారీ సంఖ్యలో స్థానిక రైతులు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు. మురళీ తారకరామారావు ప్రసంగానికి రైతుల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# చాంప్లా తండాలో ఘనంగా 'ఇందిరమ్మ' గృహప్రవేశం

**డోర్నకల్, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం):**
మండల పరిధిలోని చాంప్లా తండా గ్రామ పంచాయతీలో నూతన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు భుక్య రమేష్ - సునీత దంపతులు నిర్మించుకున్న నూతన గృహంలోకి వేదమంత్రాల సాక్షిగా ప్రవేశించారు.ఈ గృహప్రవేశ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గుగులోత్ లచ్చిరామ్, ధరంసోతు కిషన్, మలోత్ గోపి, ధారావత్ కిషన్, గుగులోత్ శంకర్, వాంకుడోత్ వాగ్య, వాంకుడోత్ బాలాజీ, ధారావత్ సురేష్, గుగులోత్ కోటేష్, బానోత్ మోతీలాల్, బానోత్ భీమ, మాలోత్ శ్రీరామ్, యువ నాయకుడు భుక్య హనుమంతు మరియు తదితరులు ఉన్నారు.



# మాస్ లైన్‌కు రాజీనామా..

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అశోక్ వర్గంలో 50 కుటుంబాలు చేరిక
- ఆహ్వానించిన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్



**మహబూబాబాద్ ఏప్రిల్ 20(ప్రభాత గమనం):**
జిల్లాలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం రాజీనామా చేసి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అశోకన్న వర్గంలో చేరారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సట్ల యాకన్న, జాటోత్ బిక్షపతి తదితర నాయకులతో పాటు సుమారు 50 కుటుంబాలు న్యూడెమోక్రసీ పార్టీలోకి చేరాయి. కొత్తగా చేరిన వారికి అశోకన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోకన్న మాట్లాడుతూ..కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి స్ఫూర్తితో సాగుతున్న ప్రతిఘటన పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం న్యూడెమోక్రసీ పార్టీ చేపడుతున్న పోరాటాలను చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. అనంతరం చేరిన నాయకులు సట్ల యాకన్న, జాటోత్ బిక్షపతి మాట్లాడుతూ.మాస్ లైన్ సిద్ధాంతాలు తమకు నచ్చకపోవడంతో రాజీనామా చేసి అశోకన్న నాయకత్వంలోని న్యూడెమోక్రసీ పార్టీలో చేరామని తెలిపారు. ఇకపై పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, ఏఐకేఎంఎస్ నాయకులు ఇరుగు నాగన్న, దేవులపల్లి నర్సిరెడ్డి, భాగ్యలక్ష్మి , పివైఎల్ నాయకులు గణేష్, పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ పాల్గొన్నారు.

### - చేరిన కుటుంబాల వివరాలు:

భానోత్ వీరన్న, ధారంగుల వెంకన్న, బోయిని యాకయ్య, బానోతు సర్దార్ లాల్, లాకావత్ బాల్యా, సభావట్ బిచ్చ, భూక్య బాలు, మాలోతు నరేష్, ధరంగుల సురేష్, మారేష్ , శ్రీను, ఓర్సు సైదులు, ధరంగుల సంపత్, యకేష్, తమిడ్ శెట్టి రాములు, బోయిని ఉప్పలయ్య, ఎస్.కె పాషా, పునపుర్తి సోమయ్య, భుఖ్య శ్రీను, దేగడి రామ తార, కందుమల్ల ప్రమీల, దారిపల్లి లక్ష్మి , నవీన్ , హర్ష, జల్లి శ్రావణి, జల్లి ప్రశాంత్, చుక్క వినయ్, సంగీతారావు, గుగులోతు దేవి, బుగులవత్ నరేష్, సునీత, చిత్రం అశోక్, పానుగంటి రాజు, సట్ల ప్రశాంత్, సట్ల సంతోష్, లాకావత్ బాల్య, లాకావత్ మంగ్య, బానోతు క్రాంతి కుమార్, సట్ల రమక్క, భోగ శ్రావణి, అక్కినపల్లి ఉమా, వార్త రమేష్, కురవి ప్రసాద్, సాగర్, పోతుగంటి పెట్టయ్య, సోమరపు శారద, బుర్ర స్వరూప, బాలాజీ, సోమన్న, ఓరుగంటి పవన్, ఆలకుంట్ల వెంకటేశ్వర్లు, ఆలకుంట్ల మలేష్, ఓర్సు నరసింహా, ఓర్సు మహేష్, లు చేరారు.



# అక్షర యోధుడు.. విద్యా కుసుమం

- ఉపాధ్యాయుడు వెంకట్రాం నర్సయ్యకు ఘన సన్మానం

**కేసముద్రం, ఏప్రిల్ 20(ప్రభాత గమనం):** అక్షరమే ఆయుధంగా, విద్యాబోధనే శ్వాసగా మలచుకుని.. నాలుగు దశాబ్దాల పాటు అజ్ఞానపు చీకట్లను పారద్రోలిన విద్యావేత్త, చీకటి వెంకట్రాం నర్సయ్య (జీవశాస్త్ర ఉపాధ్యాయులు) పదవీ విరమణ మహోత్సవం సోమవారం కేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యంత వైభవంగా జరిగింది. కేసముద్రం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ 'ఆత్మీయ సన్మాన సభ'లో నర్సయ్యను శాలువాలు, పూలమాలలతో ముంచెత్తారు.ఈ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మండల అధ్యక్షులు పెరంబూదురు వెంకట స్వామి, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మిగౌడ్ మాట్లాడుతూ.. నర్సయ్య వ్యక్తిత్వాన్ని కొనియాడారు. "చీకటిని చీల్చి వెలుగును ప్రసాదించేవాడే గురువు. తన ఇంటి పేరులోని 'చీకటి'ని తన బోధనతో రూపుమాపి, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించిన మహోన్నత వ్యక్తి వెంకట్రాం నర్సయ్య అని పేర్కొన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఆయన కేవలం పాఠాలు చెప్పడానికే పరిమితం కాలేదు, సమాజానికి ఉపయోగపడే క్రమశిక్షణ కలిగిన పౌరులను తీర్చిదిద్దారని వారు ప్రశంసించారు.'గురుదేవోభవ' అనే మాటకు నర్సయ్య నిలువెత్తు నిదర్శనమని, వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత, విద్యార్థులపై ఆయన చూపిన వాత్సల్యం నేటి తరం ఉపాధ్యాయులకు పాఠ్యగ్రంథం వంటిదని వక్తలు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనేది కేవలం సాంకేతికపరమైన ప్రక్రియ మాత్రమేనని, సమాజ సేవలో ఆయన ప్రయాణం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని ఆకాంక్షించారు. ఆయన శేష జీవితం సంపూర్ణ ఆరోగ్యంతో, ప్రశాంతంగా సాగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.ఈ వేడుకలో కన్న యాకన్న గౌడ్ స్టేషన్ మాజీ సర్పంచ్, రడం వెంకన్న గౌడ్ (కేజీఎస్ఎస్ అధ్యక్షులు, చీకటి వేలాద్రి గౌడ్ (కేజీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు), బండారు గోపమ్మ దయాకర్ గౌడ్ (ఉప్పరపల్లి మాజీ సర్పంచ్), మోడెం రవీందర్ గౌడ్ (ప్రముఖ విద్యావేత్త), అశోక్ గౌడ్ (పట్టణ అధ్యక్షులు), అల్లం వెంకన్న, వెంకన్న ముదిరాజ్ తదితరులు నాయకులందరూ నర్సయ్య విశిష్ట సేవలను కొనియాడుతూ, ఆయనను ఘనంగా సన్మానించి తమ ఆత్మీయతను చాటుకున్నారు.



# అట్టహాసంగా సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్
- వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగుదలే లక్ష్యం:కలెక్టర్

**మహబూబాబాద్, (ప్రభాత గమనం):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల' కార్యాచరణలో భాగంగా జిల్లావ్యాప్తంగా సంక్షేమ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 20 నుంచి 26 వరకు వారం రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గూడూరు మండలం మరిమిట్టాలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

వసతి గృహాల తనిఖీ – క్షేత్రస్థాయి పరిశీలన: వసతి గృహంలోని పరిసరాలను, గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ మరియు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ వారం రోజుల్లో ప్రతిరోజూ ఒక ప్రత్యేక అంశంపై (థీమ్) వసతి గృహాల్లో పారిశుధ్యం, ఆరోగ్య పరీక్షలు, మరమ్మతులు మరియు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

### మెనూ పక్కాగా ఉండాలి

విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని, డైట్ చార్టును ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు అత్యాధునిక బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంట చేసే సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హాస్టళ్లలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల మానసిక వికాసం కోసం సమ్మర్ క్యాంపులు నిర్వహించి, వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలు, సంక్షేమ విద్యా సంస్థల్లో ఈ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే అధికారులకు బాధ్యతలు కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

# ఎన్నికల నగారా!

- ఓటర్ల జాబితాల సిద్ధతపై ఎస్ఈసీ ఆదేశాలు
- మొత్తం 566 జెడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఖరారు
- మే నెలలోనే ఎన్నికల నిర్వహణకు అవకాశాలు
- జిల్లాల వారీగా కొత్త ఓటర్ల వివరాల సమీకరణ
- ముసాయిదా జాబితాల విడుదలకు ఏర్పాట్లు
- హైకోర్టు ఆదేశాలతో గతంలో నిలిచిన ప్రక్రియ
- గ్రామాల విలీనంతో స్థానాల సంఖ్యలో తగ్గుదల
- ఎన్నికల వేళ ఆశావహుల్లో ఉత్సాహం




**హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం ):** తెలంగాణ రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మేరకు ఓటర్ల జాబితాల సిద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు ప్రారంభించింది. అన్ని ప్రక్రియలు సమయానికి పూర్తయితే మే నెలలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుంచి 2026 ఫిబ్రవరి 5 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాలోని అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల జాబితాలకు అనుసంధానించాల్సి ఉంది. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలను మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఆధారంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ పరిధిలోని గ్రామ పంచాయతీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త ఓటర్ల జాబితాలను రూపొందించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ధ్రువీకరణ అనంతరం, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సూచనల మేరకు డేటాను పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించనున్నారు. ఏవైనా లోపాలు గమనించిన పక్షంలో ఈ నెల 23లోపు నివేదించాలని సూచించారు. ఆమోదం అనంతరం ముసాయిదా జాబితాలను విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించిన తరువాత తుది జాబితా ప్రకటించనున్నారు.

### గతంలో నిలిచిన ప్రక్రియ...మళ్లీ వేగం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు చివరిసారిగా 2019 మేలో నిర్వహించగా, అనంతరం ఎంపీపీలు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం గత ఏడాది జూన్‌తో ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. వాస్తవానికి గత సంవత్సరం సెప్టెంబర్ 29న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరించడం ప్రారంభించారు. అయితే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అక్టోబర్ 9న ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించగా, ఇప్పుడు మళ్లీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మార్గం సుగమమవుతున్నట్లు సమాచారం.

### స్థానాల సంఖ్యలో మార్పులు

తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 566 జెడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడంతో జిల్లా పరిషత్‌ల జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. 2019 తర్వాత పలు గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమవడంతో గ్రామాల సంఖ్య తగ్గింది. దాంతో 44 ఎంపీటీసీలు, నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గాయి.

### అభ్యర్థుల్లో ఉత్సాహం

ఎన్నికల నిర్వహణపై సంకేతాలు వస్తుండటంతో ఆశావహుల్లో ఉత్సాహం పెరుగుతోంది. ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు పూర్తవడంతో, ఇప్పుడు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం రాజకీయ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు.

## విద్యావంతులు మోసపోవడం

# బాధాకారం : సీజేఐ

- డిజిటల్ అరెస్ట్ మోసాలపై సీజేఐ దిగ్భ్రాంతి
- మోసపూరిత లావాదేవీల అదుపునకు 'కిల్-స్విచ్' వ్యవస్థపై కోర్టులో చర్చ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20(ప్రభాత గమనం) :** దేశంలో పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' ఉదంతాలపై భారత అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యావంతులు, సమాజంపై అవగాహన ఉన్నవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడటం దిగ్భ్రాంతి కలిగిస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. సోమవారం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఒక కీలక ఉదంతాన్ని ప్రస్తావించింది. "బాగా చదువుకున్న వారు కూడా ఇలాంటి మోసాలకు గురికావడం ఆశ్చర్యంగా ఉంది. తనకు తెలిసిన ఒక వృద్ధురాలు తన జీవిత కాల కష్టార్జితమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తాన్ని ఈ డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన మోసంలో కోల్పోయారు" అని సీజేఐ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమైకస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నప్పినై వాదనలు వినిపిస్తూ.. పోలీసులు లేదా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులమంటూ నేరగాళ్లు చేసే బెదిరింపులకు బాధితులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆ భయంతోనే వారు నేరగాళ్లు అడిగినంత డబ్బు చెల్లిస్తున్నారని వివరించారు. ఇలాంటి మోసపూరిత లావాదేవీలను అడ్డుకోవడానికి బ్యాంకులు, ఇంటర్నెట్ మాధ్యమాల్లో తక్షణమే నిలిపివేసే 'కిల్–స్విచ్' వంటి సాంకేతిక రక్షణలు ఉండాలని ఆమె సూచించారు.



### ఏమిటీ డిజిటల్ అరెస్ట్?

నేరగాళ్లు వాట్సాప్ లేదా స్కైప్ వీడియో కాల్స్ ద్వారా పోలీస్ అధికారులమని నమ్మిస్తారు. మీ ఆధార్ లేదా మొబైల్ నంబర్ ఏదో నేరంలో వాడబడిందని భయపెట్టి, విచారణ పేరుతో గంటల తరబడి వీడియో కాల్ లోనే ఉంచి (డిజిటల్ అరెస్ట్), బాధితుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేయడమే ఈ నేరం ముఖ్య ఉద్దేశ్యం.

### మే 12న తదుపరి విచారణ:

ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి స్పందిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి అంతర్–విభాగాల సమావేశం ఇప్పటికే జరిగిందని, తుది నిర్ణయాలు త్వరలోనే వెలువరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత వేగంగా స్పందిస్తోందని ఆయన కోర్టుకు వివరించారు. కాగా, ఈ అంశంపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు మే 12కు వాయిదా వేసింది.

## రూ.1,825 కోట్ల జీఎస్టీ మోసం కేసులో

# ప్రధాన నిందితుడు అరెస్ట్

- 22 సమన్లను బేఖాతరు చేసిన నిందితుడు
- ఎయిర్ పోర్టులో పక్కా ప్లాన్ తో పట్టుకున్న అధికారులు
- తక్కువ రకం పొగాకును ఖరీదైన రకంగా మార్చి నకిలీ ఎగుమతులు
- డమ్మీ కంపెనీలు, నకిలీ ఈ-వే బిల్లులతో రూ. 1,825 కోట్ల దోపిడీ

**న్యూఢిల్లీ, ప్రభాత గమనం:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ. 1,825 కోట్ల భారీ జీఎస్టీ రీఫండ్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కపిల్ చుగ్‌ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (DGGI) అధికారులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. దుబాయ్ నుంచి తిరిగి వస్తుండగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అహ్మదాబాద్ జోనల్ యూనిట్ అధికారులు సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో అధికారులు 22 సార్లు సమన్లు జారీ చేసినా స్పందించకుండా తప్పించుకు తిరుగుతున్న చుగ్, విదేశాలకు పారిపోయి అక్కడి నుంచే ఈ చీకటి నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. కపిల్ చుగ్ తన అనుచరుడు విపిన్ శర్మతో కలిసి అత్యంత పకడ్బందీగా ఈ భారీ స్కామ్‌కు తెరలేపాడు. ఇతరుల కేవైసీ (KYC) పత్రాలను వాడుకుని అనేక డమ్మీ కంపెనీలను సృష్టించి, కేవలం కాగితాల మీద లావాదేవీలు చూపాడు. నిరుపేదలకు నెలకు కొంత నగదు ఆశజూపి వారి పేర్లతో డైరెక్టర్ హోదాలు కల్పించి, పూర్తి నియంత్రణను తన చేతుల్లోనే ఉంచుకున్నాడు.

### నకిలీ ఇన్వాయిసులు

**నకిలీ ఇన్వాయిస్‌లు:** వాస్తవానికి వస్తువుల కొనుగోలు జరగకపోయినా, భారీ విలువ కలిగిన పొగాకు ఉత్పత్తులను కొన్నట్లు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ITC) పొందారు.

**ఎగుమతుల డ్రామా:** తక్కువ ధర కలిగిన పొగాకు ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి, వాటిని అత్యంత ఖరీదైన 'కిమామ్/జర్దా'గా నాణ్యత మార్చి చూపారు. వీటిని కాండ్లా సెజ్ ద్వారా ఎగుమతి చేస్తున్నట్లు రికార్డుల్లో చూపి, కృత్రిమంగా టర్నోవర్‌ను పెంచారు.

**భారీ రీఫండ్ క్లెయిమ్:** పన్ను కట్టకుండానే (LUT ద్వారా), కూడబెట్టిన భారీ ఐటీసీని రీఫండ్ రూపంలో నగదుగా మార్చుకుని ప్రభుత్వ సొమ్మును కాజేశారు.

**ఫోర్జరీ పత్రాలు:** రవాణా కోసం ఉపయోగించిన వాహనాల నంబర్లు, ఈ–వే బిల్లులు అన్నీ తప్పుడువేనని అధికారుల దర్యాప్తులో తేలింది.

### బ్యాంకులకు కూడా నామం!

కపిల్ చుగ్ కేవలం జీఎస్టీనే కాకుండా, తన ఎగుమతుల వ్యాపారంలో నకిలీ టర్నోవర్ చూపించి యెస్ బ్యాంక్ నుంచి సుమారు రూ. 11 కోట్లు కొల్లగొట్టినట్లు తేలింది. ఇప్పటికే సీబీఐ కూడా ఇతనిపై ఫోర్జరీ కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. అలాగే ఇతని భాగస్వామి విపిన్ శర్మపై కూడా నకిలీ బిల్లింగ్‌తో కంపెనీ విలువను పెంచి చూపినందుకు సెబీ చర్యలు చేపట్టింది. ఈ కుంభకోణం వెనుక ఉన్న మిగతా నిందితుల కోసం అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఖరీఫ్‌లో ఎరువుల

# కొరత ఉండదు

- వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్
- రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ను సందర్శన
- షెడ్యూల్ ప్రకారం యూరియా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశం



కోల్‌సిటీ, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం): రాష్ట్రంలో రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ స్పష్టం చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లోని యూరియా, అమ్మోనియా ఉత్పత్తి విభాగాలతో పాటు రైల్వే లోడింగ్ పాయింట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంటే ప్రధాన యూరియా సరఫరాదారు అని గుర్తుచేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత ఎరువుల సరఫరాలో ఎక్కడా ఆలస్యం జరగకుండా ప్లాంట్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర ఎరువుల శాఖ (DoF) కేటాయింపుల ప్రకారం యూరియాను జిల్లాలకు సకాలంలో చేరవేయాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్ఎఫ్‌సీఎల్‌కు అన్ని విధాల సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా వ్యవసాయ శాఖ, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎరువుల నిల్వలు మరియు సరఫరాలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ హెడ్ జిందాల్, ప్రొడక్షన్ హెడ్ సాహో, టెక్నికల్ సర్వీస్ హెడ్ సత్యనారాయణ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారతీయ వస్తువులకు ప్రాధాన్యతనివ్వాలి

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్
- వాషింగ్టన్ లో వాణిజ్య ఒప్పందంపై ముమ్మర చర్చలు..
- టారిఫ్ మార్పులపై భారత్ దృష్టి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ప్రభాత గమనం) :** అమెరికా మార్కెట్‌లో ఇతర దేశాల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేలా, భారతీయ వస్తువులకు 'ప్రాధాన్యత కలిగిన మార్కెట్ ప్రవేశాన్ని కల్పించే దిశగా భారత్ ప్రయత్నిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం తెలిపారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా తొలి దశ చర్చల కోసం భారత అధికారుల బృందం ప్రస్తుతం వాషింగ్టన్‌లో పర్యటిస్తోందని ఆయన వెల్లడించారు.

### మారిన నిబంధనలు - పునఃసమీక్ష

అమెరికాలో టారిఫ్ (సుంకాల) విధానంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో పాత ఒప్పంద ముసాయిదాను పునఃసమీక్షించాల్సిన అవసరం ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత ఉత్పత్తులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించేందుకు అమెరికా అంగీకరించింది. అయితే, అమెరికా ప్రభుత్వం ఇటీవల అన్ని దేశాలపై ఏకరీతిగా 10 శాతం టారిఫ్‌ను విధించడంతో, భారత ఉత్పత్తులకు ప్రత్యేక రాయితీలు లభించేలా కొత్త మెకానిజంపై చర్చలు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

### భారత్ నుంచి భారీ కొనుగోళ్లు

ఈ వాణిజ్య ఒప్పందంలో భాగంగా రాబోయే ఐదేళ్లలో అమెరికా నుంచి సుమారు 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధన ఉత్పత్తులు, విమాన విడిభాగాలు, సాంకేతిక పరికరాలు మరియు కోకింగ్ కోల్‌ను కొనుగోలు చేసేందుకు భారత్ సుముఖత వ్యక్తం చేసింది. దీనికి ప్రతిగా అమెరికాకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించేందుకు భారత్ ప్రతిపాదించింది.

### మళ్లీ నంబర్ వన్‌గా చైనా

గత నాలుగేళ్లుగా అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగినప్పటికీ, 2025–26 ఆర్థిక సంవత్సరంలో చైనా మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. గత ఏడాది అమెరికాకు భారత ఎగుమతులు కేవలం 0.92 శాతం మాత్రమే వృద్ధి చెందగా, దిగుమతులు మాత్రం 15.95 శాతం పెరిగాయి. దీనివల్ల అమెరికాతో భారత్‌కు ఉన్న వాణిజ్య మిగులు 34.4 బిలియన్ డాలర్లకు తగ్గింది. వాషింగ్టన్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ చర్చల ద్వారా ఎగుమతులకు ఊతమిచ్చేలా కీలక నిర్ణయాలు వస్తాయని కేంద్రం భావిస్తోంది.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374